క్లుప్తంగా

నల్ల గంగమ్మకు విశేష పూజలు



భక్తులకు దర్శనమిస్తున్న నల్లగంగమ్మ

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు విశేషపూజలు నిర్వహించారు. ముందుగా వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అనంతరం అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అర్చకులు, అభిషేకాలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా గ్రామోత్సవం



అభయాంజనేయస్వామి గ్రామోత్సవ దృశ్యం

పుల్లంపేట : మండల పరిధిలోని పెరియవరం కోడగడ్డపై వెలసిన అభయాంజనేయస్వామి వారికి గ్రామోత్సవం ఆదివారం కనుల పండువగా జరిగింది. పూజారి శివశర్మ ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాల మధ్య అనంతంపల్లి, అప్పారాజుపేట, రామక్కపల్లి గ్రామాలలో ఆంజనేయస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం భారీ సంఖ్యలో ఈ గ్రామోత్సవంలో భక్తులు పాల్గొని స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.

బోనాల సమర్పణ



దండువారమ్మకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు

సుండుపల్లె : భక్తులు కోర్కెలు తీర్చే బంగారు కల్పవల్లి దండువారమ్మ తిరునాల సందర్భంగా ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని గంగిరెడ్డిగారిపల్లె గ్రామంలో వెలసిన దండువారమ్మకు గ్రామ ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు చేసి బోనాలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం చెక్కభజనలు, కోలాటాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

గ్రంథాలయంలో డ్రాయింగ్ పోటీలు



డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

సంబేపల్లె : మండల కేంద్రంలోని సంబేపల్లె శాఖ గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్‌లో భాగంగా ఆదివారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అలాగే నేడు జనరల్ నాలెడ్జ్ వ్యాసరచన పోటీలు నిర్వహించి జూన్ 7వ తేదీన గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించనున్నట్లు గ్రంథాలయ నిర్వాహకుడు రెడ్డి శేఖర్ కొనియాడారు. కావున పిల్లలందరూ గ్రంథాలయానికి వచ్చి తన జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని రెడ్డి శేఖర్ కోరారు.

కంటి రోగులకు ఆపరేషన్లు



ఆపరేషన్‌కు రోగిని సిద్ధం చేస్తున్న వైద్యుడు

రాయచోటి అర్బన్ : స్థానిక లయన్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం 26 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. ఆదివారం కంటి ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి అన్నమయ్య, చిత్తూరు జిల్లాల పరిధిలోని పలువురు కంటి రోగులు హాజరయ్యారు. వీరికి కంటి వైద్యులు సురేష్‌బాబు, భార్గవిలతో కూడిన వైద్య బృందం కంటి పరీక్షలు చేశారు. 26 మందికి ఆపరేషన్లు చేశారు. అలాగే గతంలో ఆపరేషన్లు నిర్వహించిన 35మంది కంటి రోగులకు ఉచితంగా అద్దాలను అందజేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు స్వరూప్‌గుప్తా, శివప్రసాద్‌రెడ్డి, చెన్నూరు అన్వర్‌బాషా, శివరామిరెడ్డి, జయరామిరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, అప్తాల్మిక్ అసిస్టెంట్ రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బందిలు పాల్గొన్నారు.

కూడళ్లు.. మారిన రూపురేఖలు

- రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత
- ప్రాంత విశేషాలను తెలియజేసేలా కూడళ్లలో నిర్మాణాలు
- పనుల పూర్తిపై ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ



ఎస్‌ఆర్ కల్యాణమండపం రింగురోడ్డు సర్కిల్‌లో సాగుతున్న పనులు

రాయచోటి అర్బన్ : అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో కూడళ్ల సుందరీకరణ పనులు వేగంగా సాగుతున్నాయి. రాయచోటి పట్టణ సుందరీకరణ అంశంపై ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఇందులో భాగంగా బంగ్లా, మాసాపేట – వేంపల్లె క్రాస్‌రోడ్డు, చిత్తూరు మార్గంలోని సర్కిల్, గున్నికుంట్ల రింగురోడ్డు సర్కిల్‌లలో చేపడుతున్న సుందరీకరణ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. ఫలితంగా పట్టణానికి మరింత శోభ చేకూరుతోంది. పచ్చదనం, విద్యుత్‌కాంతులతో కూడళ్ల రూపుదిద్దుకోనున్నాయి. రూ 1.15 కోట్లతో త్వరలో పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలో టవర్‌క్లాక్ పనులు ప్రారంభంకానున్నాయి. అలాగే షాదీఖానా సమీపంలోని అబుల్‌కలాం విగ్రహం వద్ద సుందరీకరణ పనులు త్వరలో ప్రారంభించనున్నారు. కడప మార్గంలోని అన్నమయ్య సర్కిల్ నుంచి జాతీయ రహదారి మీదుగా చిత్తూరు మార్గంలోని ఎస్ఆర్ కల్యాణమండపం సర్కిల్ వరకు, ఠాణా నుండి చెన్నముక్కపల్లె రింగురోడ్డు వరకు మదనపల్లె రహదారిలోని శివాలయం సర్కిల్ నుంచి రింగురోడ్డు వరకు సుందరీకరణ పనులు వేగంగా సాగాయి. ఠాణా కూడలి నుండి సుండుపల్లె రోడ్డులోని ఐసీడీఎస్ కార్యాలయం వరకు బటర్ ఫ్లై వీధిలైట్ల ఏర్పాటు ప్రక్రియను కాంట్రాక్టర్ పూర్తిచేశారు. త్వరలోనే వీధిదీపాలు వెలగనున్నాయి. కూడళ్ల సుందరీకరణ పనులపై ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తున్నారు. పట్టణాభివృద్ధిలో భాగంగా నాలుగేళ్లలో గున్నికుంట్ల రహదారి విస్తరణ, అందుకు అనుగుణంగా వీధిలైట్ల ఏర్పాటు, ఠాణా నుండి సుండుపల్లె మార్గంలోని రింగురోడ్డు వరకు నాలుగు వరుసల రహదారి పనులు, చెక్‌పోస్టు నుండి మదనపల్లె రహదారిలోని రింగురోడ్డు వరకు రహదారి విస్తరణ పనులతో పట్టణానికి నూతన శోభ వచ్చింది. మాసాపేట సర్కిల్ నుంచి రింగురోడ్డు వరకు రహదారి విస్తరణ పనులను త్వరలో పూర్తి చేయిస్తామని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఇదే సమయంలో రాయచోటి రింగు రోడ్డును నాలుగు వరుసల రహదారిగా మార్చే పనులు కూడా ఒక కొలిక్కి వస్తున్నాయన్నారు. ఠాణా వద్ద నేషనల్ హైవే విస్తరణ పెండింగ్ పనులు, మిగిలిపోయిన డ్రైనేజీ కాలువ నిర్మాణం పనులు త్వరలో పూర్తవుతాయని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి వివరించారు.



సుండుపల్లె మార్గంలోని నాలుగు వరుసల రహదారిలో పూర్తయిన బటర్ ఫ్లై లైట్ల ఏర్పాటు



బంగ్లాసర్కిల్‌లో పూర్తికావచ్చిన సుందరీకరణ పనులు



రింగురోడ్డులోని గున్నికుంట్ల సర్కిల్‌లో..



మాసాపేట - వేంపల్లె సర్కిల్‌లో పూర్తికావస్తున్న పనులు

ప్రశంసా పత్రాలు అందజేత



ప్రతిభచూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

సుండుపల్లె : మండల కేంద్రంలో మానవత సంస్థ ఆధ్వర్యంలో ఈ విద్యా సంవత్సరం మండల స్థాయిలో ప్రతిభ చూపిన పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు మెమెంటో, ప్రశంసా పత్రాలను ఆదివారం అందజేశారు. బ్రైట్ ట్యుటోరియల్స్ తరఫున మండలంలో ప్రథమ స్థానంలో 576 మార్కులు సాధించిన నూరే ఉజ్మాకు రూ. 3 వేలు నగదు బహుమతిని ట్యుటోరియల్ నిర్వాహకురాలు యాస్మిన్ అందించడం జరిగింది. కార్యక్రమంలో ఎంఈఓ–2 రవి నాయక్, కోచర్ మ్యాన్ ఆర్.నాగేశ్వర, రవీంద్రనాథ్ రెడ్డి, హరికుమార్, హబీబుల్లా, సుబ్రమణ్యం, నరసింహులు, ఉపాధ్యాయులు నాగరాజు, మహబూబ్ బాషాలు పాల్గొన్నారు.

విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



గురువును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

సుండుపల్లె : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వపు విద్యార్థులు (2002–2003) సంవత్సరం విద్యార్థులు గెట్ టుగెదర్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. గురువులకు తాము ఎంతో రుణపడి ఉంటామని విద్యార్థులు తెలియజేశారు. అనంతరం పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

కనుల పండవగా పాలేటమ్మ తిరునాల



ప్రత్యేక అలంకరణలో పాలేటమ్మ



చాందినీబండ్లు తిరుగుతున్న దృశ్యం

చిన్నమండెం : మండలంలోని కలిబండ గ్రామంలో వెలసిన పాలేటమ్మ తిరునాల శనివారం రాత్రి కనుల పండువగా సాగింది. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో దాదాపు ప్రతి ఇంటి నుంచి అమ్మవారికి జంతుబలులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవాయిద్యాలు, బళ్లారి డ్రమ్స్, చెక్కభజనల నడుమ అమ్మవారికి మొక్కులు సమర్పించారు. మొక్కుబడులు ఉన్న వారు అమ్మవారికి చాందినీబండ్లు కట్టారు. శనివారం రాత్రి ఎడతెరిపిలేని వర్షం కురవడంతో ఇదంతా అమ్మవారి కృపతోనే జరిగిందని ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

రాయచోటి అర్బన్ : అనాథ శవానికి సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు రాయచోటి మున్సిపల్ రెవెన్యూ అధికారి మల్లికార్జున. వివరాలలోకెళితే.. ఎండతీవ్రత భరించలేక వృద్ధ యాచకురాలు(65) ఆదివారం మృతిచెందింది. సమాచారం అందుకున్న మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జున అక్కడికి చేరుకున్నారు. మున్సిపల్, పోలీసు, మానవత సేవా సంస్థల సహాయ సహకారాలతో యాచకురాలి మృతదేహానికి అన్నీ తానై హిందూ సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఇప్పటివరకు 140కి పైగా అనాథ మృతదేహాలకు వారివారి ఆచార సాంప్రదయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించానన్నారు. భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలు చేపడతానన్నారు. కార్యక్రమంలో ఆయనతోపాటు సంబేపల్లె ఏఎస్ఐ బాషా, కానిస్టేబుల్ రాజేంద్రతోపాటు మున్సిపల్, మానవత సంస్థల సిబ్బందిలు పాల్గొన్నారు.



అంత్యక్రియల నిమిత్తం అనాథ శవాన్ని తరలిస్తున్న మల్లికార్జున తదితరులు

ఘనంగా ముగిసిన ఎల్లమ్మ జాతర



ప్రత్యేక అలంకారంలో ఎల్లమ్మ



అమ్మవారికి బోనాలు తీసుకువస్తున్న మహిళలు

వీరబల్లె : మండల పరిధిలో వంగిమళ్ల గ్రామంలో గత రెండు రోజుల నుంచి జరుగుతున్న ఎల్లమ్మ జాతర ఘనంగా ముగిసింది. ఇందులో భాగంగా అమ్మవారికి ఆలయ పూజారులు ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున బోనాలు సమర్పించి, పూజలు చేయించి మొక్కులను చెల్లించుకున్నారు. ఉప్పరపల్లి నుంచి భక్తులు చౌడేశ్వరీదేవి అమ్మవారిని ప్రత్యేక రథంలో జ్యోతుల మధ్య అంగరంగ వైభవంగా ఊరేగింపుగా తీసుకెళ్లి ఎల్లమ్మను దర్శించుకున్నారు. మొక్కుబడులు ఉన్న వారు భక్తులు చాందినీ బండ్లను కట్టి డప్పు వాయిద్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి ఎల్లమ్మను దర్శించుకొని మొక్కుబడులను చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో జాతరలో పాల్గొన్నారు. ఎలాంటి సంఘటనలు జరుగకుండా రాయచోటి రూరల్ సీఐ తులసీరామ్, వీరబల్లి ఎస్.చంద్రమోహన్‌లు బందోబస్తును ఏర్పాటు చేశారు.



ఆకట్టుకున్న చాందినీబండ్లు

జూన్ 6 వరకు 144 సెక్షన్



సుండుపల్లె : ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ హుస్సేన్



ఒంటిమిట్ట : 144 సెక్షన్ హెచ్చరికలు జారీ చేస్తున్న పోలీసులు

ఒంటిమిట్ట : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు జూన్ 4వ తేదీ వెలువడనున్న సందర్భంగా జూన్ 3వ తేదీ నుండి 6వ తేదీ వరకు ఒంటిమిట్ట మండలంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఒంటిమిట్ట సీఐ పురుషోత్తం రాజు, ఎస్ఐ మధుసూదన్ రావులు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని బస్టాండ్, బజారు వీధి, దర్జీపల్లి రోడ్డులో ఉన్న దుకాణాలకు ఆయన 144 సెక్షన్‌కు సంబంధించిన హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ ప్రజల శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈ 144 సెక్షన్ విధించామన్నారు. ఈ సెక్షన్ అమలులో ఉన్నప్పుడు ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అత్యవసర చికిత్స కేంద్రాలు, మెడికల్ షాపులు తప్ప ఇక ఏ ఇతర షాపులుగానీ, ప్రైవేటు వాహనాలు గానీ, గుంపులు గుంపులుగా జనసందోహంగాని ఉన్నట్లైతే వారిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

సుండుపల్లె : మండలంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, చట్టాన్ని ఉల్లంఘిస్తే ఎటువంటి వారికైనా శిక్ష తప్పదని సుండుపల్లె ఎస్ఐ హుస్సేన్ తెలిపారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలో సాయుధ బలగాలతో ఆయన కవాతు నిర్వహించి నాలుగు రోడ్ల కూడలి వద్ద ప్రజలతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఎవరు గెలిచినా, ఓడినా ఊరేగింపులు చేపట్టరాదని, ఎటువంటి గొడవలు, అల్లర్లు సృష్టించినా కఠిన చర్యలతోపాటు జిల్లా బహిష్కరణ ఉంటుందని తెలియజేశారు. ఎలాంటి గొడవలు, రెచ్చగొట్టే మాటలు మాట్లాడే వారిని వదిలిపెట్టేది లేదన్నారు. కావున ఎవరి పని వారు చూసుకొని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రజలదేనని పేర్కొన్నారు. అనంతరం మండల కేంద్రంలో కేంద్ర బలగాలచే పోలీసులు కవాతు నిర్వహించారు.

కౌంటింగ్ సందర్భంగా ముందస్తు చర్యలు



సిద్దవటం: కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ పురుషోత్తంరాజు

సిద్దవటం : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఘర్షణలు చోటు చేసుకోకుండా సత్ప్రవర్తనతో మెలగాలని ఒంటిమిట్ట సీఐ పురుషోత్తం రాజు హెచ్చరించారు. స్థానిక సిద్దవటం పోలీసు స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికలు సమయంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఘర్షణలు జరిగాయన్నారు. కౌంటింగ్ సందర్భంగా ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో, ఫ్యాక్షన్ గ్రామాల్లో నాకాబందీని నిర్వహించి గొడవలకు పాల్పడవద్దని అవగాహన కల్పించామన్నారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ అనంతరం బాణాసంచా పేల్చడం, కేక్‌లు కట్ చేయడం, ఆనందోత్సవాలు నిర్వహించడం, కవ్వింపు చర్యలకు పాల్పడడం చట్టరీత్యా నేరమన్నారు. కౌంటింగ్ సమయంలో రౌడీషీటర్లు పోలీసు స్టేషన్‌లో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పెద్ద ఓబన్న, పోలీసులు పాల్గొన్నారు.

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి

వాల్మీకిపురం: బాస్కెట్ బాల్ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని అన్నమయ్య జిల్లా డీఎస్‌డీఓ గౌస్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చింతల శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గౌస్ బాషా మాట్లాడుతూ వాల్మీకిపురం బాస్కెట్ బాల్ అసోసియేషన్ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు పాటిస్తోందన్నారు. తాను జిల్లాలో ఎన్నో వేసవి శిక్షణ శిబిరాలు సందర్శించడం జరిగిందని, కానీ వాల్మీకిపురం జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరం క్రమశిక్షణతో నిర్వహించారని, క్రీడాకారులు కూడా బాస్కెట్ బాల్ క్రీడలో మంచి పట్టు సాధించడం పట్ల అభినందించారు. బాస్కెట్ బాల్‌కు మంచి వేదిక దొరకడం ఈ ప్రాంత యువతకు మంచి వరం అని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం రవిచందర్ మాట్లాడుతూ చింతల శ్రీధర్ రెడ్డి సహకారంతో క్రీడాకారులకు నెల రోజుల పాటు ఉచితంగా బాస్కెట్ బాల్ శిక్షణ ఇవ్వడంతో పాటు పౌష్టికాహారం అందించామన్నారు.

ఈదురు గాలుల బీభత్సం

- ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం
- గాలుల బీభత్సానికి దెబ్బతిన్న పండ్ల తోటలు
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలతో విద్యుత్ అంతరాయం
- అకాల వర్షాలతో ఉద్యాన రైతులకు అపార నష్టం
- ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతన్నల విన్నపం



లక్కిరెడ్డిపల్లె: నిమ్మతోట దెబ్బతినడంతో ఆవేదన చెందుతున్న మహిళా రైతు

లక్కిరెడ్డిపల్లె : మండల పరిధిలో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి మామిడి రైతన్నకు అపార నష్టం మిగిల్చింది. ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షానికి పెనుగాలులు బీభత్సం సృష్టించడంతో మండలంలోని అన్ని గ్రామాలలో కోత దశకు వచ్చిన అరకొర మామిడి కాయలు నేలరాయిపోయి పెద్దపెద్ద మామిడి చెట్లు కూకటివేళ్లతో పెకలించి దర్శనమివ్వడంతో మామిడి రైతు కుదేలైపోయారు. మద్దిరేవుల గ్రామంలోని మార్లవాండ్లపల్లె, మర్రిచెట్టు సమీపంలోని నిమ్మతోటలలో నిమ్మచెట్లు గాలికి ఎగిరిపోయాయి. దీంతో రైతులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఎక్కడికక్కడ విద్యుత్ స్తంబాలు, ట్రాన్సుఫార్మర్లు గాలుల దాటికి నేలకొరగడంతో విద్యుత్ సరఫరాలో రాత్రి నుంచి తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలు ప్రాంతాలలో రేకుల షెడ్లు గాలికి ఎగిరి పక్కకుపడ్డాయి. పెద్దపెద్ద వృక్షాలు గాలులు బీభత్సానికి నేలకొరిగాయి. రాత్రి సయయం కావడంతో ఎక్కడ కూడా ప్రాణ నష్టం జరగలేదు. ఒకింత ఉరుములు మెరుపులు, గాలులు దాడికి ప్రజలు భయభ్రాంతాలకు గురై ఇళ్లల్లోనే బిక్కుబిక్కుమంటూ ఉండిపోయారు. గాలులు దాటికి 11 కేవీ విద్యుత్ స్థంబాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ప్రతి ఏడాది మామిడి రైతుకు పంట చేతికందే సమయానికి అకాల వర్షాలు నష్టాన్ని మిగుల్చుతున్నాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా పెంచుకున్న మామిడి చెట్లు సైతం గాలుల దాటికి నేలకొరగడంతో పూర్తిగా నష్టం వాటిల్లిందిన్నారు. నష్టపోయిన మామిడి రైతుకు నష్టపరిహారం అందించాలని మామిడి రైతులు కోరుతున్నారు. ట్రాన్సుకో అధికారులను అప్రమత్తం చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, ఎంపీపీ సుదర్శన్ రెడ్డిలు తెలిపారు. ఉద్యానశాఖ సిబ్బంది మామిడి రైతుకు జరిగిన నష్టాన్ని అంచనా వేసే పనిలో పడ్డారు.

కొమ్మరపల్లెలో విధ్వంసం

రామాపురం : మండలంలోని కొమ్మరపల్లె గ్రామ పంచాయతీలోని పలు గ్రామాలలో శనివారం రాత్రి వీచిన గాలివానకు పలు కుటుంబాలు ఏర్పాటు చేసుకున్న పైకప్పులు, రేకులు గాలికి ఎగిరిపోయాయి.మరో ఇంటిపై విద్యుత్ స్తంభం కూలడంతో రేకులు ధ్వంసం కావడంతో ప్రజలు భయబాంత్రులకు గురికావడంతో, ఆ గ్రామానికి చెందిన పలువురు ఆరోపించారు. కుమ్మరపల్లి పంచాయితలోని దూదుకుపల్లెలో సుంకేసుల కృష్ణయ్య, రాజు, బండపల్లెలో షేక్ ముబారక్, మోహన్, లక్ష్మయ్య, జమాల్‌వల్లి ఇళ్లపై ఏర్పాటు చేసిన రేకులు ఈదురు గాలులకు ఎగిరిపోయాయి. పలు చెట్ల కొమ్మలు విరిగి ఇండ్లపై పడ్డాయి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. ఇండ్లపై ఏర్పాటు చేసిన రేకులు ఎగిరిపోవడంతో ప్రజలు ఆరు బయట ఉండవల్సిన పరిస్థితి వచ్చిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధించిన అధికారులు తమ గ్రామాన్ని సందర్శించలేదని తమకు న్యాయం జరగాలని గ్రామస్తులు కోరారు.

నేలకొరిగిన పండ్లతోటలు

ఓబులవారిపల్లె : మండలంలోని చిన్నఓరంపాడు పంచాయతీలో శనివారం రాత్రి వీచిన గాలులు, కురిసిన వర్షానికి కాపుతో ఉన్న అరటితోటలు నేలకొరిగాయి. రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. శనివారం రాత్రి ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చి పెద్దఎత్తున గాలులు వీచాయి. దీనికి తోడు వర్షం కురవడంతో చిన్నఓరంపాడు జాతీయ రహదారిపై వర్షపునీరు పారింది. చిన్నఓరంపాడు గ్రామానికి చెందిన బి.వెంకటరమణ అనే రైతుకు చెందిన ఐదు ఎకరాల అరటితోట పూర్తిగా నేలకొరగడంతో ఆయన తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం తమని ఆదుకోవాలని కోరుతున్నాడు.



ఓబులవారిపల్లె: గాలి, వానకు నేలకొరిగిన అరటిపంట



లక్కిరెడ్డిపల్లె: కూలిన ప్రహరీగోడ



రామాపురం: ఇంటి పడిన విద్యుత్ స్తంభం